
ఉష్ణోగ్రత (అంచనా)

28-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	25

వరద పనులపై.. అలసత్వం



- మాన్‌సూన్‌యాక్షన్ ప్లాన్ శూన్యం
- వేసవి వచ్చినా పుర పాలకులు చోద్యం
- మున్సిపాల్టీల్లో పూడిపోయిన వరద నీటి కాల్వలు
- భారీ వర్షం కురిస్తే మున్సిపాల్టీలో కాలనీలు మునకే

పనులు.. ఇలా చేయాలి

మున్సిపాల్టీల్లో పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించి వరద నీరు సులువుగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాల్వల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీసి నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగించాలి. కాల్వల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. వర్షాకాల ముందస్తు పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో ఆయా పనులు చేయాలి. కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి.

వర్షాలతో వరద.. ఇళ్లు మునకతో మున్సిపాల్టీల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ నీరు పోయే మార్గాలు లేక ఎక్కడికక్కడ కాలనీలు మునిగి పోతున్నాయి. ప్రజలకు వరద కష్టాలు తప్పించేందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాల్సిన పుర పాలకులు చోద్యం చూస్తున్నారు. వర్షాలతో ముంపు సమయాల్లో హడావుడి చేయడానికే మున్సిపల్ అధికా రులు, పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారే కానీ ముందస్తు చర్యలపై శ్రద్ధ చూపడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ కేంద్రాల్లోని కాల్వలు జమ్ము, వ్యర్థాలు, తూటికాడలతో నిండి ఉంటున్నాయి. దీంతో ఓ మోస్తరు వర్షం పడినా ఆ నీరు పోయే మార్గాలు లేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. రోజుల తరబడి ఆ ప్రాంతాల్లోని నివాసితులు నీటి మధ్య అల్లాడుతున్నారు. అదే వేసవిలో డ్రెయిన్లలో పూడిక తీస్తే వర్షపు నీరు సాఫీగా పారుదలై ప్రజలకు ముంపు కష్టాలు లేకుండా ఉంటాయి. అయితే వర్షాకాల ముందస్తు ప్రణాళిక, పనులపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. వేసవిలో చేయాల్సిన పనులను వర్షాల సమయంలో చేస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లో మురుగు, వరదనీటి కాల్వలు పూడికతో నిండిపోయి.. ఓ వర్షాలకే పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో వర్షాలు వస్తున్నాయంటే ప్రజలు వణికిపోతున్నారు. వాస్తవానికి మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు నిరంతరం కొనసాగిస్తుండాలి. ప్రస్తుత వేసవి కాలం పూడికతీత పనులకు అనువైన వాతావరణం. అయితే ఆయా పనులపై పురపాలకులు ప్రణాళికలతో ముందుకు వెళ్లడంలేదు. సమస్య వచ్చినపుడు మాత్రమే నిద్ర మేల్కొనడం అలవాటుగా మార్చుకున్నారన్న విమర్శలున్నాయి. వర్షాలు కురిసే ముందు హడావుడిగా పనులు చేపడుతున్నారు. దీని వల్ల ఫలితం లేకపోగా పాలకులు, కాంట్రాక్టర్లకు జేబులు నిండుతున్నాయి. వర్షాకాలంలో పనులు కంటికి కనిపించవు.. ఖర్చుల లెక్కతేలదు.. దీంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రతి మున్సిపాల్టీలో వేసవి ప్రణాళికను అమలు చేయాలి. వర్షాకాలంలో ప్రజలకు మురుగు.. వరద నీటి ఇబ్బందులు లేని విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలి.



వరద నీటి మునకలో నరసరావుపేట (పాత చిత్రం)

వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో కాల్వలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. ఇప్పటికైనా ముంపు నివారణలో భాగంగా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. ఈ దిశగా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసే విషయంలో పురపాలకులు మొద్దు నిద్ర వీడటం లేదు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాల్వల్లో పూడిక తీత పనులు, పగిలిన కట్టడాల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఇంకా సమాయత్తం కాకపోవటం గమనార్హం. వరదల సమయంలో ముంపునకు గురయ్యే గృహాల వారికి సాయం అందించే కన్నా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఏటా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వరద కష్టాలను ఎదుర్కొంటు న్నారు. ఈ ఏడాదైనా ప్రజలను ముంపు కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేప ట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మొక్కుబడిగా మమ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు వర్షాకాల ముందస్తు ప్రణాళికను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘాల్లో చిన్న పెద్ద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని భావించింది. గత జూలైలో పూడిక తీతకు నిధులు మంజూరు చేసింది. కొన్ని మున్సిపాల్టీల్లో ఈ పనులు మొక్కుబడిగా నిర్వహించారు. మరి కొన్ని మున్సిపాల్టీలు మమ అనిపించాయి. కేవలం నిధులు ఖర్చు చూపించాలన్న ఉద్దేశంతోనే పనులు చేపట్టారే కానీ ముంపు సమస్య పరిష్కరించాలన్న ఉద్దేశం లేదన్న విమర్శలు వచ్చాయి.



నరసరావుపేటలో జమ్ము, వ్యర్థాలతో పూడి పోయిన ప్రధాన వరద నీటి కాల్వలు

కబ్జాలో కాల్వలు

జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్లతో పాటు మూడు జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాల్లో వరద నీటి కాల్వలు చాలావరకు ఆక్రమణల పాలయ్యాయి. కాల్వలపైనే కొందరు నిర్మాణాలు చేపట్టారు. పూడిక తీయడానికి వీలు లేకుండా కబ్జా చేసేశారు. కాల్వలపై ఆక్రమణలతో వర్షపు నీరు పోయే మార్గాలు లేకపోయినా వాటి తొలగింపునకు కనీస ప్రయత్నాలు జరగడంలేదు. మున్సిపల్ రికార్డుల్లో నమోదైన ప్రకారం కాల్వల విస్తీర్ణం లేదు. కాల్వలను మాయం చేసేలా నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే రోడ్లు చెరువులను మరిపిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి.

నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

❖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు సినీ రచయిత, సీనియర్ నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక, నాటకాల పోటీలు ప్రారంభమయ్యాయి. నాటకాల ప్రారంబోత్సవ సభకు పరుచూరి అధ్యక్షత వహించి, మాట్లాడారు. తన కుమారుడు ఈ గ్రామంలో నడయాడాడని, అతని అకాల మరణం పొందడంతో ఇక్కడ నందమూరి తారక రామారావు కళా ప్రాంగణాన్ని నిర్మించి తన కుమారుడు జీవించే ఉన్నారన్న భావనతో రంగస్థల కళాకారులతో ఏటా నాటకోత్సవాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సినీ నటి శివపార్వతి మాట్లాడుతూ పరుచూరి రవిబాబు రంగస్థల కళాకారుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. తమ గురువులు పరుచూరి సోదరులు ఏర్పాటు చేసిన నాటకోత్సవాల్లో తనకు అవకాశం కల్పించారన్నారు. తనలా ఎంతో మంది కళాకారులకు పరుచూరి సోదరులు చేయూతనిచ్చారని చెప్పారు. తెలుగు ప్రముఖ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ నాటక కళను గ్రామీణ ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు. అనేక వ్యయ ప్రయాసాలకోర్చి పెద్ద వయసులో కూడా నాటక రంగానికి జీవం పోస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు అభినందనీయులనికొనియాడారు. హైదరాబాద్ నుంచి నటీనటులను ఈ ప్రాంతానికి తీసుకు వచ్చి కళా రంగంపై మక్కువ కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. తొలుత నాటకోత్సవాల ప్రారంభ జ్యోతి ప్రజ్వలన శివపార్వతి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సినీనటులు సుబ్బరాయశర్మ, వాఖ్యత అయినాల మల్లేశ్వరరావు, సినీ నటుడు పరుచూరి సుదర్శన్, వేజండ్ల బసవపున్నారావు, వేజండ్ల శివరామప్రసాద్, వేజండ్ల సాంబశివరావు, మండవ రామకోటేశ్వరరావు, రాయన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చెత్త అక్కడే..



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

- కంపు కొడుతున్న గ్రామాలు
- జీతాల్లేక పనులు నిలిపేసిన కార్మికులు
- గ్రామాల్లో మూలనపడిన స్వచ్ఛ వాహనాలు

రేపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని వీధులు చెత్తతో నిండిపోయాయి. రోజుల తరబడి చెత్త పేరుకుపోయి ఉంది. స్వచ్ఛభారత్ కార్మికులు జీతాలు అందక విధులకు హాజరు కావడంలేదు. పారిశుధ్య వాహనాలు మూలన పడి ఉన్నాయి. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి ఉండటంతో పల్లె వీధులు కంపుకొడుతున్నాయి. జిల్లాలోని పలు పంచాయతీల్లో స్వచ్ఛభారత్‌లో వాహనాలు నడిపే డ్రైవర్లకు, స్వీపర్లకు పది నెలలుగా జీతాలు మంజూరు కావడంలేదు. దీంతో వారు పనులు ఆపేయడంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటింది. జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల నియోజకవర్గాల పరిధిలో చెత్త సేకరించే వాహనాలు 1800 ఉన్నాయి. ఒక్కో యంత్రానికి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. మేజర్ పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.10 వేలు, స్వీపర్లకు రూ.6 వేల వేతనాలు ఇవ్వాలి. మామూలు పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.8 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు ఇవ్వాలి. అయితే పది నెలలుగా వారికి జీతాలు మంజూరు కావడంలేదు. వేతనాలు రాకపోతుండటంతో పనులు చేయలేమంటూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో పల్లె వీధులు చెత్తచెదారాలతో పేరుకుపోతుండగా, రూ.లక్షల విలువైన వాహనాలు పంచాయతీ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. అసలే ఎండాకాలం కావడం.. వీధుల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా దుర్వాసన వెదజల్లి ప్రజలు అల్లాడుతున్నారు. అంటువ్యాధుల బారిన పడుతున్నామంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి రూ.100 చొప్పున పంచాయతీవారు పన్ను కట్టించుకుంటున్నారని చెత్త ఎత్తడానికి కార్మికులు రావడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛ భారత్ నుంచి గతంలో నిధులు మంజూరయ్యేవని అయితే గతకొంతకాలంగా రాకపోవడంతో జీతాలు చెల్లింపులు నిలిచినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.



ధూళిపూడిలో మూలనపడిన తడి, పొడిచెత్త ఎత్తే వాహనాలు

కదల్లేని వారికి కార్డులెలా?



సీనియర్ సిటిజన్ కార్డు

- వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డుల కష్టాలు
- సచివాలయాలకు వెళ్తేనే ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది
- ఇంటి వద్దనే కార్డు మంజూరు చేయాలంటున్న వృద్ధులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డులను పొందలేని పరిస్థితి పలువురు వృద్ధుల్లో నెలకొన్నది. కార్డు కోసం సచివాలయాలకు వెళ్లాల్సి రావడమే ఇందుకు కారణం. వృద్ధుల్లో కొందరు అనారోగ్య సమస్యల దృష్ట్యా నడవలేని వాళ్లు ఉన్నారు. వారు కార్డు కోసం సచివాలయానికి వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. అసలే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల సమయం దాటిన తర్వాత వృద్ధులు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. ఒకవేళ ఎక్కడికైనా బయటకు వెళ్లి వస్తే వడదెబ్బ బారిన పడుతు న్నారు. గుంటూరు జిల్లాలో 85 ఏళ్ల వయస్సు పైబడి వృద్ధులు దాదాపుగా 17 వేల మంది ఉన్నారు. ఇక బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోనూ వేల సంఖ్యలో వృద్ధులు ఉన్నారు. గ్రామాలు, కొన్ని పట్టణాల్లో సుదూరంగా సచివాలయాలు ఉన్నాయి. అక్కడ వరకు ఎండల్లో వెళ్లలేక.. కార్డులు పొందలేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల వరకు సిబ్బంది రావడంలేదు.. ఆ తర్వాత కూడా రకరకాల పనులు, ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఎండలో అంతదూరం వెళ్లలేక.. వెళ్లినా గంటల తరబడి నిరీక్షంచలేక పోతున్నారు.ఈ పరిస్థితుల్లో సచివాలయాలకు వెళ్లి సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను సిబ్బంది మంజూరు చేస్తున్నారు. ఎవరైతే 60 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూపు, ఆధార్ లింక్ మొబైల్ నంబరు తీసుకుని వచ్చిన వారికి దరఖాస్తు ఇచ్చి దానిని పూర్తి చేయించి సచివాలయాల సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దాంతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతున్నది. ఆ కార్డులో వృద్ధుడు/వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, మాస్కుడ్ ఆధార్ నంబరు, సీనియర్ సిటిజన్ కార్డు నంబరు, బార్ కోడ్, చిరునామా, కాంటాక్టు నంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైలు నంబరు, ఎమర్జన్సీ నంబర్లు పొందుపరిచి ఉంటున్నాయి. ఈ సీనియర్ సిటిజన్ కార్డులు పలు విధాలుగా వృద్ధులకు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కార్డుతో పలు ప్రయోజనాలు..

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయి. వృద్ధాప్య పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఇందుకు కారణంగా ఈ కార్డులోనే పుట్టిన తేదీ నమోదై ఉంటుంది. అలానే ఆధార్ నంబరు కూడా ఉంటుంది. మిగతా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలన్నా ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టిక్కెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకుల్లో వృద్ధులకు ప్రత్యేకించి అధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ల స్కీమ్‌లకి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆస్పత్రుల్లోనూ సీనియర్ సిటిజన్ కార్డు ఉపయోగపడుతుంది. రైల్వే టిక్కెట్ కౌంటర్లలో త్వరితగతిన టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లుగా సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

దిక్సూచి
DIKSUCHI

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

ప్రతి అటెంప్ట్‌లో ఇంప్రూవ్‌మెంట్

❐ మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? ఎంత వరకు చదువుకున్నారు?
జ: మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూరులో, ఆరు నుంచి పది వరకు కాగజ్‌నగర్ నవోదయ, తరవాత త్రిచిలోని ట్రిబుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. నాన్నపేరు గోవింద్‌జాదవ్, హెడ్ కానిస్టేబుల్. అమ్మ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అక్క శృతి, వైద్యురాలు.
❐ సివిల్స్‌లో మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? ఈ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలు పెట్టారు?
జ: 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఆ తరవాత ఢిల్లీకి వెళ్లి ఒక సంవత్సరం కోచింగ్ తీసుకుందాం అనుకున్నాను. అయితే కోవిడ్ ఎఫెక్ట్‌తో మధ్యలోనే వదిలేసి వచ్చేశాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేదు. 2020, 2021లో మళ్లీ రాశాను. అయితే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా, కాని మెయిన్స్ దాటలేదు. 2022లో ఇంటర్వ్యూకు వెళ్లాను. కానీ ర్యాంకు రాలేదు. మళ్లీ 2023లో మెయిన్స్ దశ దాటలేక పోయాను. అయితే అదే సంవత్సరం 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్' వచ్చింది. ఆరో ప్రయత్నంలో 2024లో విజయం సాధించాను. నా ర్యాంకుకు ఐఏఎస్ రావచ్చు.
❐ మొదటి సారి విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు....?
జ: సివిల్స్ పరీక్షలు రాసిన ప్రతీసారి నాలో కొంత ఇంప్రూమెంట్ కనిపించింది. అదే ప్రధాన కారణం. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. దీంతో ఏదో వస్తుందన్న ఆశ పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు స్నేహితులు మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.


సాయి చైతన్య జాదవ్
68వ ర్యాంకు

❐ రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా?
జ: ఎన్ని గంటలు ప్రిపేర్ అనేది కాదు కాని ఎంత చదివితే అర్థమవుతుందో అంత వరకే చదివే వాడిని. పరీక్షలు దగ్గర పడినప్పుడు మాత్రం రోజుకు 10 నుంచి 13 గంటలు చదివే వాడిని. ఎన్ని గంటలు చదివాము అన్నది కాకుండా, ఎంత అర్థం చేసుకో గలిగాం అన్నది ముఖ్యం.
❐ సివిల్స్ రాయాలంటే కోచింగ్ తప్పని సరా?
జ: నా ఉద్దేశ్యంలో కోచింగ్ అవసరం లేదు. ఒకరిని చూసి మరొకరు కోచింగ్‌కు వెళుతున్నారు. ఏదో కొంత తప్ప, గత కోచింగ్ ప్రస్తుతం ఉపయోగపడతుందన్న గ్యారెంటి లేదు. స్నేహితులను చూసి నేను కూడా కోచింగ్‌కె వెళ్లాను. కాని మధ్యలోనే వచ్చేశాను. ఐదేళ్లుగా సొంతంగానే సిద్ధం అయ్యాను. కాకపోతే స్నేహితులతో కలిసి మాక్ ఇంటర్వ్యూలు చేయడం జరిగింది.
❐ జనరల్ స్టడీస్‌కు, అలాగే ఆప్షనల్‌కు ఏ మెటీరియల్ చదివారు....?
జ: రోజు న్యూస్ పేపర్ చదవడంతో మన చుట్టు పక్కల ఏం జరుగుతుందనే విషయంపై అవగాహన వస్తుంది. ఇది ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా అన్ని స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రకమైన ప్రామాణిక బుక్స్ అవసరం. ఉదాహరణకు నా ఆప్షన్ ఆంత్రోపాలజీ. మొదటి నుంచి దీనితోనే సివిల్స్ రాస్తున్నాను. మొదట్లో ఒక నెల రోజులు కోచింగ్ వెళ్లినా అంతగా అర్థం కాలేదు. మొదటి సారి మెయిన్స్ రాక పోవడంతో ఎక్కువ సమయం దొరికింది. దాంతో సొంతగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను.
❐ సివిల్స్‌లో మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది...? ఎంత సేపు జరిగింది. ఎలాంటి ప్రశ్నలు అడిగారు?
జ: నన్ను రాజ్‌శుక్లా సర్ బోర్డు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. ఆరోజు నాలుగో వ్యక్తిని. ఇంటర్వ్యూ అప్లికేషన్ ఫాంలో మొత్తం 22 సర్వీస్‌లను పేర్కొనాల్సి ఉండగా నేను ఐఏఎస్, ఐపీఎస్ రెండు సర్వీస్‌లను మాత్రమే పెట్టాను. ఇంటర్వ్యూలో దీనిపై అడిగారు. నాకు ఆల్ రెడీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ సంబంధించిన 'ఐఎఫ్ఎస్' సర్వీస్ ఉందని చెప్పాను. ఏపీ నుంచి విడిపోయిన తరవాత తెలంగాణలో అభివృద్ధి ఎలా ఉంది. అలాగే కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందా? అని అడిగారు. నా సొంత జిల్లా ఆదిలాబాద్ కాబట్టి అడవుల గురించి అడిగారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఆదిలాబాద్ గిరిజన తెగల గురించి ప్రశ్నించారు. మా నాన్న పోలీసు కాబట్టి ఆ డిపార్ట్‌మెంట్ గురించి కూడా అడిగారు.

ఎం. రాజేశ్వర్, అదిలాబాద్

విష్ణుమూర్తి అవతారాలేమిటి?

సివిల్స్ ప్రిపరేషన్ అంటేనే సుదీర్ఘ ప్రయాణం. ఇందులో ఎన్ని ఆటుపోటులు వచ్చినా చివరి వరకు పట్టు విడవకూడదు. అలా విజేతగా నిలిచిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన బాన్న వెంకటేష్. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో తన ప్రిపరేషన్ ఎలా సాగింది, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడిగారో 'దిక్సూచి' పాఠకులతో ఆయన పంచుకున్నారు.


బాన్న వెంకటేష్
15వ ర్యాంకు

❐ సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించినందుకు అభినందనలు.. మీ కుటుంబ నేపథ్యం చెప్పండి.. ఏమి చదువుకున్నారు..?
జ: థాంక్యూ. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామం. తొమ్మిదో తరగతి వరకు శ్రీకాకుళంలో, ఇంటర్‌మీడియట్ విశాఖపట్టణంలో.. బీటెక్ తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లిలో పూర్తిచేశాను. నాన్న చంద్రరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ రోహిణి గృహిణి. మా తమ్ముడు వంశీ 'ఇస్రో'లో సైంటిస్ట్.
❐ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? సివిల్స్ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలుపెట్టారు?
జ: బీటెక్ తర్వాత నెలకు రూ. 1.5 లక్షలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. కానీ సంతృప్తి లేదు. ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పాజిటివ్‌గా ఆలోచించాను. జాబ్‌కు రిజైన్ చేసి 2021 అక్టోబరు నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను.
❐ ఈ ప్రయాణంలో తొలుత విఫలం అయినప్పుడు ఎలా మోటివేట్ చేసుకున్నారు?
జ: 2022లో తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా దాటలేదు. కానీ డీమోటివేట్ కాకుండా సిలబస్ కంప్లీట్ చేసుకుంటూ రెండో దఫా పరీక్షకు బాగా సిద్ధం అయ్యాను. 2023లో 467 ర్యాంకు వచ్చింది. ఆంధ్ర కేడర్ ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ పోలీస్ అకడామీలో ఉన్నా. 2024లో ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను.
❐ ఇంత మంచి ర్యాంకు వస్తుందని ఊహించారా?
జ: నేను వంద నుంచి 150లోపు ర్యాంకు వస్తుందని ఊహించాను. 15వ ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావాలనుకున్నాను. అదే వచ్చింది.
❐ రోజుకి ఇన్ని గంటలు తప్పనిసరిగా చదవాలనే నియమం ఏమైనా పెట్టుకున్నారా?
జ: సివిల్స్ అంటే చదువు విషయంలో ప్లానింగ్ ఉండాలి. రోజుకి ఎనిమిది గంటలు కచ్చితంగా చదివా. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే అయ్యేది.
❐ సివిల్స్ లాంటి అత్యున్నత లక్ష్యం పెట్టుకున్నవారు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా? ఒకవేళ మీరు కోచింగ్ తీసుకుంటే అది ఎలా ఉపయోగపడింది?
జ: ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. మాక్ టెస్టులు రాశాను. బాగా ప్రిపేర్ అయ్యాను. రెండో అటెంప్ట్‌కు ఐపీఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో ఐఏఎస్.
❐ జనరల్ స్టడీస్‌కు మెటీరియల్ ఏమి చదివారు? అలాగే ఆప్షనల్‌కు ఏమి మెటీరియల్ చదివారు?
జ: అందరి ప్రిపరేషన్‌లాగానే నాదీ జరిగింది. ఆప్షనల్‌గా 'జాగ్రఫీ' ఎంచుకున్నాను.
❐ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది? మొత్తం ఎంత సేపు జరిగింది? ఇంటర్వ్యూలో మిమ్మల్ని ఎలాంటి ప్రశ్నలు అడిగారు? ఏమైనా గుర్తున్నాయా?
జ: లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా సర్ బోర్డు అరగంటకు పైగా నన్ను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుతం ఐపీఎస్‌లో ఉన్నావుగా.. మరెందుకు ఐఏఎస్‌కు రావాలనుకుంటున్నావు..? అనే ప్రశ్న వేశారు. అలాగే ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి కొన్ని అంశాలపై ప్రశ్నలు వేశారు. మీ జిల్లాకు మీరు కలెక్టర్ అయితే అక్కడ ఉన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు అని కూడా అడిగారు.
❐ మీకు అత్యంత కఠినం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అని భావించిన ప్రశ్న ఏమైనా ఉందా?
జ: ఎలక్ట్రానిక్స్‌లో కొన్ని అంశాలపైనా, టెక్నాలజీ గురించి కొన్ని డీటెయిల్డ్‌గా చెప్పమన్నారు. నాకు ఎంతవరకు తెలుసో అంతవరకే చెప్పాను. తెలియని అంశంపై సైలెంట్‌గానే ఉన్నా.
❐ అతి సులువు ప్రశ్నగా దేనిని భావించారు?
జ: మీ పేరు 'వెంకటేష్' కదా.. ఆ పేరుకున్న అర్థం ఏమిటి అని అడిగారు. పాపాలను హరించేవాడని.. విష్ణు అవతారంలో ఒకరైన శ్రీ వెంకటేశ్వరుని పేరు అది అని చెప్పాను. అయితే విష్ణు అవతారాలలో నాలుగు చెప్పండి అని అడిగితే నాలుగు అవతారాలను చెప్పేశాను.
❐ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మిమ్మల్ని అడిగిన ప్రశ్నలు ఏవి?
జ: తెలంగాణ గురించి అడగలేదుకానీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో సువిశాలమైన తీరప్రాంతముంది కదా.. ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చు... అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమస్యలు.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో ఉన్న సమస్యలు గురించి అడిగారు. క్షుణ్నంగా వివరించాను.

తాతపూడి సురేష్‌బాబు, శ్రీకాకుళం

రాజంపేటపై అడిగారు?

కలలు కనడం కాదు.. వాటిని సాకారం చేసుకోవాలనే అబ్దుల్ కలామ్ మాటలు అతనిలో స్ఫూర్తి నింపాయి. బీటెక్‌లో సీనియర్స్ ఎక్కువ మంది సివిల్స్‌వైపు వెళ్లడంతో తాను ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నారు కడపకు చెందిన శివ గణేష్ రెడ్డి. అందుకు అనుగుణంగా ప్రయత్నించి విజయం సాధించారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా మూడో ప్రయత్నంలో ఎలా విజయం సాధించారో వివరించారు.


చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి
119వ ర్యాంకు

❐ కుటుంబ నేపథ్యం ఏమిటి. ఎంత వరకు చదువుకున్నారు?
జ: మధ్యతరగతి కుటుంబం మాది. సొంత ఊరు కడప పట్టణం అలంకానపల్లె. పదో తరగతి వరకు కడప, ఇంటర్మీడియట్ నెల్లూరులో, తరవాత హైదరాబాద్ ఐఐటిలో బీటెక్ పూర్తి చేశాను. ఐఐటిలో చదివే సమయంలో ఎక్కువ మంది సీనియర్లు సివిల్స్‌కు ఎంపిక అయ్యారు. దీంతో నేను ఎందుకు పరీక్ష రాయకూడదూ అనే ఆలోచన వచ్చింది. దానికి అనుగుణంగా ముందుకు సాగాను. నాన్న మల్లికార్జునరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫ్యాకల్టీగా చేశారు. ప్రస్తుతం వ్యవసాయం చూసుకుంటున్నారు. అమ్మ ఇందిరా ప్రియదర్శిని గృహిణి. చెల్లెలు శివ జ్యోతిక ప్రస్తుతం మాస్టర్స్‌కు ప్రిపేర్ అవుతోంది.
❐ ప్రస్తుతం ఏ సర్వీసు వస్తుందని అంచనా వేస్తున్నారు...?
జ: సివిల్స్‌లో నా ర్యాంకు 119. ఐఏఎస్ వస్తుందని అనుకుంటున్నాను. ఏ సర్వీసు వచ్చినా పర్వాలేదు.
❐ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది. రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా.....?
జ: సివిల్స్‌లో విజయం సాధించాలంటే ముఖ్యంగా సామాజిక, వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా దిన పత్రికలు చదవాలి. ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలోనే మెయిన్స్ అంశాలపై నిశిత దృష్టి సారించాలి. నా విషయానికి వస్తే రోజుకు 6 నుంచి 7 గంటల సేపు చదివాను. ఇంజినీరింగ్ పూర్తి కాగానే 2020లో కోచింగ్‌లో చేరాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కొన్ని పోర్టల్స్ అందుబాటులో ఉన్నాయి. మెయిన్స్‌కు ఎలా సిద్ధమవ్వాలి. అక్కడ ఏయే అంశాలపై ప్రశ్నలు వస్తాయో తెలుపుతూ ఆర్టికల్స్ ఇస్తారు. రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నామన్నది కాదు ఆయా అంశాలను ఎలా అకళింపు చేసుకున్నామన్నదే కీలకం. క్రమశిక్షణగా ముందుకు సాగితే ఎంపికవడం సులభం.
❐ సివిల్స్‌కు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా?
జ: నా దృష్టిలో కోచింగ్ ఉంటే మంచిది. ప్రిపరేషన్ త్వరలో గాడిలో పడుతుంది. నేను 2020 లో బీటెక్ పూర్తయిన వెంటనే ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లాను. కరోనా నేపథ్యంలో రెండేళ్ల గ్యాప్ వచ్చింది. తర్వాత రెండుసార్లు సివిల్స్ రాసినప్పటికీ ఫలితం రాలేదు. మూడో అటెంప్ట్‌లో జాతీయస్థాయిలో 119వ ర్యాంక్ వచ్చింది.
❐ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది?
జ: ఛైర్మన్ ప్రీతి సుగం మేడమ్ నేతృత్వంలో ఇంటర్వ్యూ అర్ధగంట సేపు సాగింది. మనం ఇచ్చే డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో ఉన్న అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు.
❐ ఇంటర్వ్యూలో కఠినమైన ప్రశ్నలు లేదా ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?
జ: కడప జిల్లాలో రాజంపేట సంబంధించి చెప్పమని ప్రశ్నించగా ఒక్క సారి ఆశ్చర్యపోయా. ఊహించని ప్రశ్న. అయినా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. అలాగే కడప జిల్లాలో మహిళల సమస్యలు, వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించారు వాటికి కూడా సమాధానం చెప్పడం జరిగింది.

విలియం జాన్ కళ్యాణ, ఎడ్యుకేషన్ రిపోర్టర్, కడప

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పది కాలాల పాటు గుర్తుండే సినిమా

ప్రియదర్శి కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'సారంగపాణి జాతకం' పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమా. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కుటుంబ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. మా సినిమాను సూపర్ హిట్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశాం. ప్రతి ఒక్కరు ఈ వేసవిలో మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' ఓ వరంలా దొరికింది' అనిప్రియదర్శి అన్నారు.





అంచనాలను మించి అలరిస్తుంది

ఎస్ఎస్ రాజమౌళి

"నేను తీసే మహాభారతంలో నాని పోషించేది ఏ పాత్ర అనేది చెప్పను గానీ.. అందులో ఆయన కచ్చితంగా ఉంటాడు. నిర్మాత ప్రశాంతిని హిట్ మెషీన్ అని పిలుస్తుంటాం. 'హిట్ 3' కూడా ఆమెకు ఘనవిజయాన్ని అందిస్తుంది. ఈ 'హిట్ ఫ్రాంచైజీకి అంతం లేదు. నాని తీసే ప్రతి సినిమాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. ఈ సినిమా అంచనాలను మించి అలరిస్తుంది. ఆయన ఇప్పటికే అందనంత ఎత్తుకు ఎదిగారు. మరింత గొప్ప స్థాయికి ఎదగాలి. ఈ సినిమాకు సూపర్‌హిట్ పక్కా అనే వైబ్ కనిపిస్తోంది" అని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. మే 1న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఇందులో హింస మీరు భయపడేలా కాదు, ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఒక మంచి థ్రిల్లర్‌కు పక్కా కమర్షియల్ సినిమా జతకలిస్తే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ఒకప్పుడు రాజమౌళిగారు నా సినిమాలు చూసి ఎలా ఉందో చెప్పేవారు. కానీ ఆ సంప్రదాయం ఈ మధ్య మిస్సయ్యింది. ఈ సినిమాను మాత్రం ఆయన మొదటి రోజు చూస్తారని ఆశిస్తున్నాను. లేదంటే ఆయన పాస్‌పోర్ట్ లాగేసుకుంటా. ఆయన పేరు ఇప్పటికే సినిమా డిక్షనరీలోకి వెళ్లిపోయింది. రోమాలు నిక్కబొడుచుకునే ఏ సన్నివేశానికైనా రిఫరెన్స్ కావాలంటే.. 'రాజమౌళి ఎపిసోడ్' అని అనడం అలవాటు అయిపోయింది. ఈ సినిమాలోనూ ఒక అద్భుత సన్నివేశం ఉంటుంది. దాన్ని నేను, శైలేష్ 'రాజమౌళి మూమెంట్' అని పిలుస్తుంటాం. విష్వక్ సేన్, అడివి శేష్ ఈ 'హిట్ యూనివర్స్'కు మూలస్తంభాలు. శైలేష్ కొలను ఎంతటి ప్రతిభావంతుడో సినిమా విడుదల రోజున మీకందరికీ తెలుస్తుంది. సినిమా బాగుండాలి. సినిమాను కాపాడుకుందాం. ఈ గురువారం మనకు సినిమా అంటే ఎంత ప్రేమ ఉందో దేశానికి చూపిద్దాం. 'హిట్ 3' మీ అంచనాలను అందుకోకుంటే 'ఎస్ఎస్ఎమ్‌బీ29'ని చూడొద్దండి. ఈ సినిమాతో పాటు విడుదలవుతున్న 'రెట్రో', 'రైడ్ 2' చిత్రాలూ బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. "హిట్ ఫ్రాంచైజీకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇదో న్యూ ఏజ్ సినిమా" అని హీరో విష్వక్ సేన్ అన్నారు. "ఈ సినిమా చివరి 30 నిమిషాలు చూశాను. చాలా బాగుంది. ఆరంభ వసూళ్లు అదరిపోతాయి" అని అడివి శేష్ తెలిపారు. "సినిమా అంటే నానిగారికి అపారమైన ప్రేమ. నన్ను ఇంతగా నమ్మిన ఆయనకు కృతజ్ఞుడ్ని" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు. "నానిగారితో నటించడం ఒక మరిచిపోలేని అనుభూతి" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి తెలిపారు.

త్రీడీ వెర్షన్‌లో



చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలైంది. ఈ బ్లాక్‌బస్టర్ విడుదలై 35 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్రీడీ వెర్షన్‌లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

క్రిమినల్ కథేంటి?





క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన తమిళ చిత్రం 'రాకాదన్'. వంశీకృష్ణ, రియాజ్‌ఖాన్, దినేశ్ ప్రధాన తారాగణం. దినేశ్ కలై దర్శకుడు. కే హైమావతి నిర్మించారు. ఇప్పుడు ఈ చిత్రం 'క్రిమినల్ 123' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజేఆర్ పిక్చర్స్ పతాకంపై రామకృష్ణ, కిశోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మే తొలివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: మానస్‌బాబు.

ప్రత్యేక పాత్రలో సమంత



నటి సమంత తన సొంత బ్యానర్ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కంద్రేగుల దర్శకుడు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆదివారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. గ్రామంలోని మహిళలంతా టీవీలో సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తిస్తుంటారు. వారి నుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా ప్రత్యేక పాత్రలో సమంత ప్రత్యక్షమవుతారు. హాస్యం, హారర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్‌ని చూస్తే తెలుస్తోంది.

డ్రగ్స్ కేసులో మలయాళ దర్శకుల అరెస్టు

ఇటీవలె మలయాళ నటుడు షైన్ టామ్‌చాకోను డ్రగ్స్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. 'నేనొక్కడినే కాదు, మలయాళ పరిశ్రమలో చాలా మంది మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారు' అని ఆయన చేసిన వాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా, మలయాళ పరిశ్రమకు చెందిన ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 'జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహ్మాన్, 'తమాషా' ఫేమ్ అష్రఫ్ హంజాలతో పాటు వారి స్నేహితుడు షలీఫ్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొచ్చిలోని ఓ అపార్టుమెంటులో సోదాలు నిర్వహించిన పోలీసులు వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వారు ముగ్గురూ కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

గ్రామీణ ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఆదివారం షూటింగ్ మొదలైంది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో టీఏ స్టార్ మూవీ మేకర్స్ పతాకంపై తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. గౌతమ్ రవిరావు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విపిన్ వి రావు.

చదువుతోనే అసమానతలు లేని సమాజం

● యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్‌కల్యాణ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చదువుతో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని యూపీఎస్సీలో 146 ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజన సేవా సమితి ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు.



చల్లా పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న కమ్మజన సేవా సమితి సభ్యులు

కష్టపడి గాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పవన్ కల్యాణ్ తండ్రి రమేష్ మాట్లాడుతూ తమది మధ్యతరగతి కుటుంబమని, పట్టుదలతో చదివి ఈ స్థాయికు తన కొడుకు చేరుకున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. కుమార్తె సుచరిత కూడా చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోందని తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్‌లే దేశాన్ని నడిపిస్తున్నారని అటువంటి కీలక బాధ్యతలు తీసుకుంటున్న పవన్‌కల్యాణ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులు కోటా వంశీ, సమితి గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి కల్యాణ్ కృషిని కొనియాడారు. అనంతరం చల్లా పవన్ కల్యాణ్, తల్లిదండ్రులను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

❖ ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడిన కారు

బాపట్లరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కారుని వేగంగా నడపడంతో.. అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. బాపట్ల మండలం రామ్‌నగర్‌కు చెందిన దండప్రోలు కృపాకర్ (30), బాపట్ల పట్టణానికి చెందిన అశోక్ అనే ఇద్దరు మద్యం సేవించారు. కృపాకర్‌ను రామ్‌నగర్‌లో దించేందుకు ఇద్దరూ కారులో వెళ్తుండగా ముత్తాయపాలెం గ్రామ సమీప మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో కృపాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీవ్రగాయాల పాలైన అశోక్‌ను తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం చీరాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉంది. బాపట్లరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హరిలో రంగ హరి నాటికలోని ఓ సన్నివేశం




ఉక్కు సంకెళ్లు నాటికలోని ఓ సన్నివేశం

ప్రేక్షకులను అబ్బురపరిచిన నాటికలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. మండల పరిధిలోని పల్లెకోనలో ఆదివారం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వెలగలేరు థియేటర్స్ ఆధ్వర్యంలో హరిలో రంగహరి నాటకాన్ని తొలుత ప్రదర్శించారు. సమాజంలో అందరి జీవితాలు ఒకేలా ఉండవు. ఒకరి ఇష్టాలు ఇంకొకరి పిచ్చిలా, చాదస్తంగా అనిపిస్తాయని.. ప్రస్తుత కాలంలో సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆదరించే వారిని అదో రకంగా చూడడం మామూలు అయిపోయిందని, తాత తండ్రుల నుండి వంశపారంపర్యంగా వస్తున్న హరిదాసు వృత్తిని కొనసాగించాలని కోటేష్ అనే వ్యక్తి ఎదురైన అడ్డంకులు, అవమానాలు తట్టుకుని ఎలా అధిగమించాడనే ఇతివృత్తంతో ఈ నాటిక కొనసాగింది. పూలదాసు శ్రీనివాసరావు దర్శకత్వంలో నటీనటులు సురభి రాఘవ, సాయిదీపిక, ఫరూక్, స్వరూప్ మిరియాల, పవన్‌కల్యాణ్, శ్రీనివాసరావు, కొండలరావు, సురభి లలిత, గట్టు రవి తదితరులు పోషించిన పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండవది ఉక్కు సంకెళ్లు నాటిక ప్రదర్శించారు. మత్స్యకారుల చేపల వేట వృత్తాంతంతో సాగిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఉప్పులూరి సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో సింహప్రసాద్ రచించారు. అనంతరం కావూరి సత్యనారాయణ రచించగా ఈపూరి హరిబాబు దర్శకత్వంలో చిరు మేఘం నాటిక ప్రదర్శించారు. ఈ మూడు నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

రెండు పళ్ల విభాగంలో.. బయ్యారం ఎడ్లజత విజయం



బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా జరిగాయి. జత పళ్ల విభాగంలో 3,553.05 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన కేఎంకే బుల్స్ మణికంఠ ఎడ్ల జత మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో 3,500 అడుగుల దూరం లాగి ప్రకాశం జిల్లా బసినేపల్లి గ్రామానికి చెందిన ఎడ్లకంట్ల వెంకట చైతన్య కుమార్ ఎడ్ల జత, మూడవ స్థానంలో 3,324.05 అడుగులు దూరం లాగి కడప జిల్లా పాలూరు గ్రామం హేమలత బుల్స్ కొణుదల హేమలతారెడ్డి ఎడ్ల జత, నాల్గవ స్థానంలో 3,278.4 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా అబ్బూరు గ్రామానికి నక్కా బల రామకృష్ణ యాదవ్, మాచాయపాలెం గౌరు కార్తికేయ కంబైన్డ్ ఎడ్ల జతలు, ఐదవ స్థానంలో 3,235.06 అడుగులు దూరం లాగి పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కేకేఆర్ బుల్స్ కల్లూరి కార్తీక నాయుడు, భార్గవ్ నాయుడు ఎడ్ల జత, 6వ స్థానంలో 3,195 అడుగుల దూరాన్ని లాగి సూర్యపేట జిల్లా మేళ్ళచెరువు గ్రామం కేకేఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, రెవెల్యూష్ రెడ్డి ఎడ్ల జతలు నిలిచాయి. మొదటి బహుమతికి రూ.20వేలు నగదు బచ్చు జనార్దన్ జ్ఞాపకార్థం బచ్చు సుధీర్, రెండవ బహుమతి రూ.15వేలు రుద్రాల అచ్చారావు, మునిని శ్రీను, బొడ్డపాటి రామకృష్ణ, మూడవ బహుమతి రూ.10వేలు కె.వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం విష్ణుమూర్తి, అనంత కోటేశ్వరరావు, నాల్గవ బహుమతి రూ.8వేలు కమతం శ్రీనివాసరావు, 5వ బహుమతి రూ.6వేలు ఏఎంఆర్ ఎలక్ట్రికల్స్ ఆశం అచ్చిరెడ్డి, 6వ బహుమతి రూ.5వేలు గుడె నిహారిక, నగదుతో పాటు షీల్డ్ ప్రదానం చేశారు.

కల్తీ ఆయిల్ వ్యాపారం.. వైసీపీ నేతపై కేసు నమోదు



ఆయిల్ కల్తీకి స్థావరమైన మిల్లు (ఇన్‌సెట్లో) చీదెళ్ల కృష్ణ, వైసీపీ నాయకుడు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నాయకుడు చీదెళ్ల కృష్ణపై నెల్లూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పిడుగురాళ్ల - మాచర్ల రహదారి పక్కనే ఉన్న నూనె మిల్లులో రాష్ట్రంలోని ప్రముఖ బాండ్ల పేరుతో కల్తీ ఆయిల్ తయారు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడన్న అతనిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో నెల్లూరులోని ఓ కంపెనీ నుండి 15 టన్నుల ఆయిల్ ట్యాంకర్ బెంగుళూరుకు కొన్ని రోజుల వరకు వెళ్లకపోవడంపై కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి గురై ఆయిల్ అంతా కిందపోయిందని కట్టుకథలకు పోలీసులు తనదైన శైలిలో విచారించగా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల కృష్ణతో కలిసి కల్తీ వ్యాపారానికి సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో నెల్లూరు పోలీసులు శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల సమీపంలో చీదెళ్ల కృష్ణకు చెందిన ఆయిల్ మిల్లులో సోదాలు నిర్వహించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను అడ్డుపెట్టుకొని అతను కల్తీ నూనె వ్యాపారం పెద్ద ఎత్తున సాగించాడు. ప్రతినెలా పలుశాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి, వైసీపీ నాయకులతో సిఫార్సు చేయించుకోవడంతో సంబంధిత అధికారులు కల్తీ వ్యాపారం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. నెల్లూరు నుండి బెంగుళూరుకు వెళ్లాల్సిన ఆయిల్ ట్యాంకర్‌ను దారిమళ్లించి ఆయిల్‌ను చోరీ చేసిన ఘటనలో చీదెళ్ల కృష్ణ, రవిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేయడంతో పిడుగురాళ్లలో వైసీపీ నేతలు ఉలికిపాటుకు గురయ్యారు. విచారణలో ముడుపులు తీసుకున్నట్లుగా తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని అధికార పార్టీ నేతలు భయపడుతున్నారు. వైసీపీ హయాంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా చీదెళ్ల కృష్ణ సతీమణి రేవతి పనిచేశారు.

ఉగ్రదాడిలో అమరులకు రైల్వే స్కౌట్స్, గైడ్స్ ఘన నివాళి

● కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్



కొవ్వొత్తుల ర్యాలీలో డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఏడీఆర్ఎం, అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన దేశ పౌరులకు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదాలు చేశారు. ర్యాలీ ముగింపు కార్యక్రమం సందర్భంగా రైల్వేస్టేషన్‌లో అమరులకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పిడుగురాళ్ల ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఉంటున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆదివారం పిడుగురాళ్ల పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. చల్లా అనిల్ కుమార్ అదే ప్రాంతానికి కృష్ణా జిల్లా నుంచి వచ్చి నివాసం ఉంటున్న తల్లికూతుర్లతో పరిచయం పెంచుకున్నాడు. మహిళ పట్టణ పరిధిలో ఓ రెస్టారెంట్‌లో పనికి వెళ్తోంది. ఇంటిలో ఒంటరిగా ఉంటున్న ఆమె 17 ఏళ్ల కూతురుతో కొన్నాళ్లుగా అనిల్‌కుమార్ చనువుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూతురు ఆరోగ్యంలో మార్పులు గమనించిన తల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో అనిల్ కుమార్‌పై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● ముగ్గురూ ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులే.. ● రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాల వారి వీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ విషయాలను అమలాపురంలోని ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. జనవరి 11న అమలాపురంలోని కురసాలవారి వీధిలోని ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు సభ్యుల ముఠా గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడప 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాలగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ఈ ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేదించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.



అమలాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఆ జిల్లా ఎస్పీ కృష్ణారావు

తెలంగాణ నూతన సీఎస్ ఒకప్పటి గుంటూరు కలెక్టరే



కే రామకృష్ణారావు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె.రామకృష్ణారావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ అధికారి అయిన రామకృష్ణా రావు 2004కి ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కలెక్టర్‌గా ఉన్నప్పుడే సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తొలిసారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టారు. ఎన్నికల యంత్రాంగాన్ని సమాయత్తం చేసి ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఆయన తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ రాష్ట్రానికి సీఎస్ కావడంతో అప్పట్లో జిల్లాలో విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులు ఆయనతో కలిసి పని చేసిన రోజులను జ్ఞాపకం చేసుకొంటున్నారు.

పట్టాలపైకి పశువులను తీసుకురావొద్దు

● యజమానులకు రైల్వే రక్షక దళం విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పశువులను రైలు పట్టాల మీదకు తీసుకొచ్చి ప్రయాణికుల భద్రతకు హాని తలపెట్టొద్దని రైల్వే రక్షక దళం, ఇంజనీరింగ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే



నడికుడి మార్గంలో పశువుల కాపర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రైల్వే అధికారులు

అధికారులు మాట్లాడుతూ పశువులను రైలు ఢీ కొడితే అవి చనిపోవడంతో పాటు రైలు పట్టాలు తప్పే ప్రమాదం ఉందని తెలిపారు. అలానే రైలు ఇంజిన్ పాడైపోయే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల రైళ్ల సమయపాలన దెబ్బతింటుందని, అలానే ఎమర్జన్సీ బ్రేకులు వేయడం వల్ల ప్రయాణికులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పశువులను లెవల్ క్రాసింగ్‌ల వద్ద దాటించేటప్పుడు కచ్చితంగా వాటికి రెట్రో రిఫ్లెక్ట్ ప్లేట్స్ అమర్చాలని సూచించారు. అలానే రైలు పట్టాల సమీపంలోకి పశువులను తీసుకురావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌జీపీ పీఎఫ్ ఏఎస్ఐ బి.సుబ్బారావు, పీడబ్ల్యూఐ సాయికృష్ణ, పిడుగురాళ్ల ఎస్ఐపీఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



తెడ్ల లక్ష్మి (ఫైల్‌ఫొటో)

వెల్దుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని కేపీగూడెంలో చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన వివాహిత తెడ్ల లక్ష్మి (60) శనివారం సాయంత్రం తన తల్లి ఊరైన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు వెళ్లింది. తాను మాచర్లకు వెళ్తున్నానని చెప్పి రాత్రి ఇంటి నుంచి బయలుదేరింది. ఆదివారం మండలంలోని కేపీగూడెం సమీపంలోని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుస్తులు లేకుండా విగతజీవిగా పడిఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సమందర్‌వలి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించా రు. లక్ష్మి మృతదేహం సగం కాలిపోయి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆత్మహత్య లేక ఏదైనా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో సమస్యాత్మక ప్రాంతంగా ఉన్న ఐతానగర్‌లో రౌడీషీటర్లను అణచివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పుతామని టూటౌన్ సీఐ రాములనాయక్ అన్నారు. ఐతానగర్ అంబేడ్కర్ విగ్రహం రోడ్డులో గత గురువారం పోలీసు కానిస్టేబుల్‌పై ఒక రౌడీ షీటర్, సస్పెక్ట్ షీట్లు ఉన్న ఇద్దరు మరొక యువకుడు కలసి దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాముల నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గతంలో తెనాలిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, అక్రమ మద్యం,



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాముల నాయక్

దొంగతనాలు తదితర కేసుల్లో చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ బాబులాల్, దోమ రాకేష్ నిందితులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పలుమార్లు అప్పటి త్రీటౌన్ ప్రస్తుతం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కన్నా చిరంజీవి నోటీసులు ఇచ్చారని చెప్పారు. అలా ప్రతిసారి పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం నిందితులకు ఇబ్బంది అనిపించి, కానిస్టేబుల్‌ను చంపేందుకు ప్రణాళిక వేశారని వెల్లడించారు. ఇందుకు ఐతానగర్‌కు చెందిన రౌడీ షీటర్ వేము నవీన్ సహాయం తీసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఐతానగర్ వైపు వెళ్తున్న కానిస్టేబుల్ చిరంజీవిపై ఈ నలుగురు నిలువరించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. కానిస్టేబుల్ చిరంజీవి తప్పించుకొని స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ వివరించారు. కేసు నమోదు చేసి, ముగ్గురు నిందుతులను ఐతానగర్ లింగారావు సెంటర్‌లో ఆదివారం అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. ఎస్సై షేక్ సుభాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వేస్ట్ కేబుల్స్ దగ్ధం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ వద్ద వేస్ట్ కేబుల్స్‌లో మంటలు చెలరేగాయి. స్టేషన్ మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దగ్ధమైన కేబుల్స్ విలువ సుమారు రూ.40 వేలు ఉండవచ్చని అధికారులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.50 అడుగులు ఉంది. ఇది 139.43 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

టెర్రరిజం నశించాలి... ప్రపంచశాంతి వర్ధిల్లాలి

● జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : టెర్రరిజం నశించాలి, ప్రపంచశాంతి వర్ధిల్లాలని జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని అబ్దుల్‌కలాం, ఘంటసాల విగ్రహాల వద్ద ఆదివారం మేధోమధన సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ బ్రహ్మం అధ్యక్షత వహించగా కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పహల్గాం ఘటన ప్రపంచదేశాల్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆధునిక కాలంలో యుద్ధం మానవ వినాశనం , అమాయక ప్రజల ప్రాణాలు నష్టం, ఆస్తీ నష్టం జరగకుండా ప్రభుత్వాలు దౌత్య పద్ధతిలో ప్రపంచశాంతి కాపాడుకోవాలని ఆయన కోరారు. ఐక్యరాజ్యసమితి టెర్రరిజంపై సిద్ధాంతిక పోరాటం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సాహితిభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, రౌతు వేణుగోపాల్, దేవళ్ళ వెంకయ్య, కె.రాజ్యలక్ష్మి, డేగల వెంకటేశ్వర్లు, సాంబశివరావు, కాగిత శ్రీహరిరావు, నాళం సూర్యనారాయణగుప్తా, అచ్చికోలు గాంధీ, ఒంగోలు రత్తయ్య, సాంబశివరావు, సుభాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద పహల్గాం ఉగ్రవాద దాడికి నిరసనగా కరపత్రాలు విడుదల చేస్తున్న జనవిజ్ఞానవేదిక, సీనియర్ సిటిజన్స్ నాయకులు

సీపీఎస్ విధానం దివ్యాంగులకు మినహాయించాలి

● శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖలలో పని చేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని మినహాయించాలని శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎల్లయ్య కోరారు. బాపట్ల ఎన్జీవోహోమ్‌లో ఆదివారం జిల్లా శారీరక ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎ.శివాజిగణేశన్ అధ్యక్షత వహించగా ఎల్లయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి కండీషన్‌లు లేకుండా 7 సాధారణ సెలవులను ప్రతి ఒక్క దివ్యాంగుడికి వర్తింప చేయాలన్నారు. ఫేషియల్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు ఉద్యోగుల సమస్యలు వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కోశాధికారి శివ,జిల్లాకమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, మురళి, కృష్ణమోహన్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య , చిత్రంలో సంఘ సభ్యులు

వైభవంగా శ్రీ సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణం

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో ఉన్న శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో హనుమాన్‌చాలీసా పారాయణ కార్యక్రమంలో 45 రోజుల దీక్ష పూర్తయిన సందర్భంగా ఆదివారం శ్రీ సువర్చలాదేవి సహిత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, రామదూత హనుమాన్ మూలమంత్ర హోమం నిర్వహించి శ్రీసువర్చలాదేవి సహిత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణోత్సవాన్ని జరిపారు. కన్వీనర్ బి.బాబునాగేంద్ర, అవధానులు వంశీ, రవితేజ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మలిశెట్టి బాలాజి భ్రమరాంబ, బుర్లె శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు కన్యదాతలుగా ఉండి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబునాగేంద్ర, లీలా పద్మలత, నారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, అంజనీ సురేష్, శ్యామలాదేవి, రమేష్‌బాబు, శ్రీలక్ష్మి, మామిడి రమేష్, గంగాభవాని, గోపిచంద్, ప్రసన్నాదేవి, కొత్రా శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు పీటలపై కూర్చొన్నారు. అదేవిధంగా ఆదిలక్ష్మి, భారతిదేవి, లక్ష్మీ, సత్యరమాదేవి తదితర భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహాప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.



శ్రీ సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం చేస్తున్న భక్తులు, పండితులు

మహిళలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

● అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉన్న కూటమి పార్టీలు మహిళలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఆదివారం ఐద్వా జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లానాయకురాలు టి.సుభాషిణి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలకు ముందుగా కూటమి పార్టీలు తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసిలో ఉచితబస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక చోట్ల మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు అరికట్టటానికి ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. మైక్రోఫైనాన్స్ సంస్థలు పేదప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని రుణాలిచ్చి వేలరూపాయలు దోచుకుంటున్నాయన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో దీనిపై మండలస్థాయి వరకు సమీక్ష చేయాలని కోరారు. పట్టణాలలో, గ్రామాలలో మద్యం ఏరులై పారుతుండటం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. దీనిపై నియంత్రణ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా నాయకురాలు సుధావాణి, ఐద్వా జిల్లా నాయకులు టి.సుభాషిణి, ఎన్.లక్ష్మీ, సీహెచ్ సుదీప్తి, వెంకటేశ్వరమ్మ, దానమ్మ, స్పందన, నాంచారమ్మ, శారద, వైకుంఠం, చాంధిని, పార్వతి, ధనకుమారి, ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

కేంద్ర మంత్రిని కలిసిన బాపట్ల బీజేపీ నాయకులు

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 2వ తేదిన అమరావతి రానున్న సందర్భంగా ఏర్పాట్లపై చర్చించటానికి విజయవాడ విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం బాపట్ల జిల్లా బీజేపీ నాయకులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కొండారెడ్డి అనీల్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాని పర్యటన విజయవంతం కావటానికి చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మంత్రి వారికి మార్గనిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా పని చేసి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



24వ వార్డు నేతాజీనగర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన ప్రధాన డ్రెయిన్



రైల్వేస్టేషన్ పక్క బజార్‌లో కుళ్ళిపోయిన వ్యర్థాలు, పేరుకుపోయిన చెత్తాచెదారం

సమస్యల వలయంలో రేపల్లె

● వ్యర్థాలు, గుర్రపు డెక్కతో పూడుకుపోయిన డ్రెయిన్‌లు
● చెత్తా చెదారంతో రహదారులు దర్శనం
● తాగునీటి కోసం పట్టణ ప్రజల ఇక్కట్లు

రేపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : పురపాలక శాఖ అధికారులు, పాలకులు రేపల్లె పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్పా ఆచరణలో సాధ్యమైన పరిస్థితి లేదు. పురపాలక సంఘం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. వేసవిలో ప్రజలకు తాగునీరు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రధాన డ్రెయిన్‌లు వ్యర్థాలతో పూడుకుపోయి ఉండటంతో మురుగునీరు పారుదల కాక దోమల బెడద పెరిగిపోయి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.

వ్యర్థాలతో డ్రెయిన్లు

పట్టణంలో ప్రధాన డ్రెయిన్లు అన్ని గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోవటంతో మురుగునీరు పారుదలకాక పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాజేష్ థియేటర్ రహదారి, ఆర్‌కే మోడల్ స్కూల్ రహదారి, డొంకరోడ్డులోని డ్రెయిన్‌లు వ్యర్థాలతో పూడుకుపోయి మురుగునీరు పారుదల అయ్యే పరిస్థితి లేదు. 24వ వార్డు నేతాజీనగర్‌లోని ప్రధాన రహదారి ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోవటం 28వ వార్డులో ప్రధాన డ్రెయిన్ గుర్రపు డెక్కతో పూడుకుపోయింది. 13వ వార్డులోని ఉప్పుడి డ్రెయిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపు డెక్క, నాచు విపరీతంగా పెరిగిపోవటంతో ఎక్కడికక్కడ మురుగు నీరు పారుదల కాని పరిస్థితి నెలకొంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి విషజ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు తెలిపినా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

తాగునీటి కోసం పట్టణ వాసుల ఇక్కట్లు

వేసవి కాలం కావటంతో అరవపల్లి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగంటటంతో పట్టణ వాసులకు రెండు పూటలా సమృద్ధిగా తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలుమార్లు 28, 1వ వార్డు ప్రజలు త్రాగునీరు అందటం లేదంటూ అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలో రెండుపూటలా తాగునీరు అందించాల్సిన పరిస్థితి ఉన్నా ఒక్కపూట కూడా సరిగ్గా తాగునీరు అందించే పరిస్థితిలేదు. మొక్కుబడిగా 15, 20 నిమిషాలవరకే నీరురావటంతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. చేసేదిలేక నిత్యం రూ.100 పెట్టి వాటర్ బాటిల్స్ ద్వారా తాగునీరు కొనుక్కునే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిసారించి సమృద్ధిగా తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నీటి మట్టం తగ్గిన అరవపల్లి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్

చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలి

● జనసేన నాయకుడు విన్నకోట

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు విన్నకోట సురేష్ తెలిపారు. మండలంలోని అడవిగ్రామపంచాయతీ కృపానగర్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేననాయకులు కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, పడమటి ధర్మారావు గౌడ్, విష్ణుమొలకల చంద్రమోహన్, తిరుమలశెట్టి సాగర్, కంచర్లపల్లి నరేంద్ర, నరేష్, సాంబ సతీష్, కొల్లా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జనసేన నాయకుడు విన్నకోట సురేష్

జత్వానీపై అక్రమ కేసు కుట్ర అమానుషం : కొల్లా


బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ క్యాంప్ కార్యాలయానికి అప్పటి ఇంటలిజెన్సీ డైరెక్టర్ జనరల్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ డీసీపీగా ఉన్న విశాల్ గున్నీలు ముంబై వెళ్ళి సినీనటి కాదంబరీ జత్వానిని అరెస్టు చేయాలని లేకుంటే విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చిన ప్రమోషన్ ఆపేస్తానని హెచ్చరించినట్లు ఆయన ఇచ్చిన సెల్ఫ్ డిక్లరేషన్ కుట్రను బట్టబయలు చేసిందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి జత్వానీపై తప్పుడు కేసులు పెట్టించటంలో కూడా ఐపీఎస్ అధికారి అరాచకాలు బహిర్గతమయ్యాయన్నారు. జగన్ జమానాలో రాక్షస రాజ్యమేలినట్లు దీనిని బట్టి రుజువు అవుతుందన్నారు. నటి జత్వానిపై కేసు నమోదు కాకముందు రోజే ముంబై వెళ్ళి ఆమెను అరెస్టు చేసేందుకు ఫ్లైట్ టిక్కెట్‌లు పోలీసులు బుక్ చేయటం కూడా కుట్రని కుండబద్దల కొడుతుందని కొల్లా పేర్కొన్నారు.

శ్వాస మీద ధ్యాస ధ్యానంతో జ్ఞానం పెరుగుతుంది

● ధ్యాన మాస్టర్ శ్రీకాంత్

కర్లపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : శ్వాస మీద ధ్యాస ధ్యానంతో జ్ఞానం పెరుగుతుందని హైదరాబాద్ ధ్యాన మాస్టర్ శ్రీకాంత్ అన్నారు. కర్లపాలెం గణపవరం రోడ్డులోని గురువాణి ధ్యాన మందిరంలో ఆదివారం అమావాస్య ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురితో ధ్యానం చేయించారు. పిరమిడ్ ధ్యానంతో తొందరగా ధ్యానం కుదురుతుందని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కూనం చంద్రశేఖర్, లీలా కుమారి, ధ్యానపరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



యాజలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

కర్లపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం యాజలి గ్రామదేవత అయిన శ్రీ పుట్టలమ్మ తల్లి తిరునాళ్ళ సందర్భంగా యాజలి టీడీపీ అధ్యక్షుడు దామర్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు, తెలుగు యువత పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు

కర్లపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శాఖ గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించటం జరుగుతుందని గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలబాలికలకు పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, వివిధ కార్యక్రమాలు జరుగుతాయని ఆమె అన్నారు.

పేదలకు అన్నదానం

అమృతలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉత్తర ఎస్సీ కాలనీలోని బాబు జగ్జీవన్‌రామ్ పార్కులో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. గడ్డిపాటి ఆదిశేషారత్నం జ్ఞాపకార్థం కుమారుడు ప్రభాకరరావు గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేయగా ఎంపీపీ రావర్ల నరేంద్రకుమార్ ప్రారంభించారు. వెలువోలు ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

యాజలిలో ఘనంగా శ్రీపుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్ళ



శ్రీ పుట్టలమ్మ అమ్మవారు

కర్లపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామంలో ఉన్న శ్రీపుట్టలమ్మ అమ్మవారి ఆలయం వద్ద తిరునాళ్ళ మహోత్సవం వేలాది మంది భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, పసుపుకుంకుమపూజలు, పలురకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారంసాయంత్రం శిడిమానుకు మేకపిల్లను కట్టి గ్రామంలోని రైతులు పండించిన పంటలను శిడిమానుకు అలంకరణ చేసి గ్రామంలో ఊరేగింపు గావించారు. శిడిమాన్‌కి భక్తులందరూ నారికేళఫలాలు, పలురకాల ఫలాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరునాళ్ళలో పాలుపంచుకున్నారు.

● తిరునాళ్ళ మహోత్సవంలో ఆప్త(యుఎస్‌ఎ)వారి ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకుడు విన్నకోట సురేష్, ఇక్కుర్తి లక్ష్మీనరసింహవర్మ, నియోజకవర్గ జనసేన సైనికులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కమిటీ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

● జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారిణి రాజాదెబోరా

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ గెజిట్ ప్రకారం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలపై జరుగు అత్యాచార కేసుల పరిశీలన, నివారణ చర్యల కొరకు ఏర్పడిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీని జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి జె.రాజాదెబోరా తెలిపారు. కమిటీలో సభ్యులుగా ఉండటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సభ్యులు (నాన్ అఫిషియల్ మెంబర్స్) అనధికార సభ్యులు 5 ఖాళీలు, ఇతర కులాలకు చెందిన ఎన్జీవోస్ ముగ్గురు చొప్పున నియమించటం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై సామాజిక సేవాదృక్పధం, పౌరహక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మే 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

షటిల్‌లో ద్వితీయ స్థానంలో రేపల్లె

● ముగిసిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుమ్మడి పవన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో ఈనెల 26, 27 తేదీలలో జరిగిన పోటీలలో పురుషుల విభాగం ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు బెంగళూరుకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విజయవాడకు చెందిన హిమదీప్-వంశీలు ప్రథమ స్థానంలో నిలవగా, రేపల్లె జట్టు హేమంత్-మునీర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మూడోస్థానం నెల్లూరు కైవసం చేసుకోగా, నాల్గో స్థానం విజయవాడ దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు పీడీటీఏ జిల్లా కార్యదర్శి పావులూరి విజయ్‌కృష్ణ, కొమ్మినేని లక్ష్మణ్, యలవర్తి త్రిశంకర్‌రావు, యలవర్తి మల్లేశ్వరరావు, హైదరీ క్లబ్ ఉపాధ్యక్షులు ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ గుండవరపు రాఘవు విజేతలను బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.12వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందజేశారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి యువకుడికి గాయాలు

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు ఎక్కబోయి కిందపడిన ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సింహపురి రైలులో వస్తూ బాపట్ల రైల్వేస్టేషన్‌లో తాగునీరు పట్టుకునేందుకు దిగిన షార్వన్ అనే వ్యక్తి రైలు కదలటంతో పరుగున వెళ్ళి ఎక్కే ప్రయత్నం చేశాడు. దీంతో ఫ్లాట్‌ఫారం, రైలుకు మధ్య కాలుపడి తీవ్రగాయమైంది. జీఆర్‌పీ పోలీసులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

బైక్, స్కూటీ ఢీకొని వ్యక్తికి...

బాపట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మూర్తిరక్షణనగర్ వద్ద స్కూటిపై వెళుతున్న భూపతి సుబ్రహ్మణ్యంను బైక్ ఢీకొట్టటంతో తీవ్రగాయాలయ్యాయని పట్టణ ఎస్ఐ చంద్రవతి తెలిపారు. చింతలపూడికి చెందిన సుబ్రహ్మణ్యం బాపట్ల వచ్చి వెళుతుండగా ప్రమాదం జరిగిందని క్షతగాత్రుడి స్నేహితుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు తగిలి బైక్‌పై వెళుతున్న వ్యక్తికి..

బాపట్ల వైపు నుంచి ఖాజీపాలెం బైక్‌పై వెళుతున్న సంజీవ్‌ని వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర కారు తగలటంతో కిందపడి గాయాలైనట్లు ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

అమృతలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం అందజేశారు. అమృతలూరు మండలంలోని యడవూరు, మూల్పూరు వివిధ గ్రామాలకు చెందిన నాగరాజు, యానదమ్మలు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. వీరు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి సాయం కోరుతూ ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అర్జీ అందజేశారు. దీంతో సీఎం కార్యాలయం నుంచి బొంత నాగరాజుకు రూ.లక్ష 53 వేల 452, రెడ్డి యానాదమ్మకి రూ.24 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బొంతా ఆంజనేయులు, మొవ్వ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

వేమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు టీడీపీ బాపట్ల పార్లమెంటరీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. సమావేశానికి ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీసే బాలవికాస్ కేంద్రాలు

చెరుకుపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన దేవాలయాలలో జరుగుతున్న బాలవికాస్ కేంద్రాల వార్షికోత్సవం గుళ్ళపల్లి నూకాలమ్మతల్లి దేవస్థాన కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా బాలవికాస్ కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి అధ్యక్షత వహించారు. గుంటూరు విభాగ్ సంయోజక పోలగంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీసే విధంగా ఆటల పోటీలు నిర్వహించామన్నారు. వారికి వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, బొలగాని వెంకటేశ్వర్లు, బండారు శ్రీనివాసరావు, వరికూటి గోపి, పడమట వెంకటేశ్వరరావు, ధర్మప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, మాతాజీలు భార్గవి, నిర్మల జ్యోతి, గున్నం అనూష, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న యల్లాప్రగడ సీతాపతి

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు


భట్టిప్రోలు, కొల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : శాఖ గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వై.రాంబాబు ఆదివారం తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ వరకు నిర్వహించే విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ పరిధిలో ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా తమ సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పౌరగ్రంథాలయ సంచాలకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు సమ్మర్ సమయాన్ని గ్రంథాలయానికి వచ్చి ఎన్నో రకాల కథలు, పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, జాతీయ నాయకుల పుస్తకాలు, స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు చదువుకోవచ్చు అని చెప్పారు. వివిధ రకాల పోటీలను విద్యార్థులకు గ్రంథాలయంలో నేర్పించటం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే విధంగా ప్రోత్సాహించాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

● మండలంలోని ఖాజీపాలెం, చందోలు, మంతెనవారిపాలెం శాఖా గ్రంథాలయాలలో వేసవి దృష్ట్యా విద్యార్థులకు గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించటం జరుగుతుందని గ్రంథాలయాధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణీకి తీవ్ర గాయాలు



గాయపడిన గర్భిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ గర్భిణీ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామానికి చెందిన కమ్మెల అప్పారావు దంపతులు భట్టిప్రోలు మండలం ఐలవరం జాతీయ రహదారిపై భట్టిప్రోలు వైపు వస్తుండగా ఆర్ అండ్ బీ రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌కు ఎటువంటి సూచికలు లేకపోవడం, పైగా ఆ ప్రాంతంలో ఇసుక పడి ఉండటంతో స్పీడు బ్రేకర్ కనిపించక వాహనం జారిపోవడంతో అప్పారావు భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో భట్టిప్రోలు వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వేగ నిరోధకాలకు ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

గడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు



తగలబడుతున్న గడ్డి

నగరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ధూళిపూడి సమీపంలోని వుయ్యూరువారిపాలెంలో ఆదివారం గడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో పెనుప్రమాదం తప్పింది. సుమారు 1.5 ఎకరాల వరి గడ్డి పూర్తిగా దగ్ధమై కాలిపోయింది. స్థానికులు పవర్‌స్ప్రేయర్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. మండల పరిధిలోని అనేకచోట్ల విద్యుత్‌స్తంభాలు పాడై తీగలు కిందకు వేలాడుతూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాల తీగలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

చికెన్ ధరలో తగ్గుదల



చికెన్ దుకాణం వద్ద పెద్ద ఎత్తున ఉన్న కొనుగోలుదారులు

అద్దంకి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు హెచ్చుతగ్గులుగా ఉన్నాయి. బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృతి చెందుతున్న సమయంలో చికెన్ అమ్మకాలు పూర్తిగా తగ్గాయి. అనంతరం క్రమేపి మరోసారి అమ్మకాలు ఊపందుకున్నాయి. గత నెలలో అద్దంకి లో చికెన్ ధర కిలో 100 రూపాయలు ఉండగా క్రమేపి పెరుగుతూ వారం రోజుల క్రితం ధర రూ.200లకు చేరింది. ప్రస్తుతం మరలా రూ.160కి తగ్గింది. ఇలా చికెన్ ధర రోజుకో రేటుతో నడుస్తుంది. ఆదివారం కావడం, ధర కూడా పెరిగి తగ్గడం తో అద్దంకిలో చికెన్ దుకాణాల వద్ద కొనుగోలు దారులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. బల్లికురవలో కిలో చికెన్ రూ.150 రూపాయలకే అమ్మకాలు చేశారు. దీంతో సాధారణ అమ్మకాల కంటే 20 శాతం మేర అమ్మకాలు పెరిగినట్లు సమాచారం.

1 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ. ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వి.కొప్పెరపాడు గ్రామంలో మే ఒకటో తేదీ నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంట్రీ ఫీజురూ.500 చెల్లించాలన్నారు. గెలుపొందిన విజేతలకు మెదటి బహుమతిగా రూ. 20,116, రెండో బహుమతిగా రూ. 15, 116, మూడో బహుమతిగా రూ. 10,116, నాలుగో బహుమతిగా రూ. 5, 116, నగదు బహుమతులను అందజేస్తామని మరిన్ని వివరాలకు 7036938516, 6305006862, 9705200374 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

చీరాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి చీరాల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు ధనమ్మ తెలిపారు. శిబిరంలో డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డాన్స్, క్యారమ్స్ వాటిపై అవగాహన కల్పిస్తారని వివరించారు. అలాగే శిక్షణ అందించేందుకు అనుభవం గల ఫ్యాకల్టీలు సహకరించాలని కోరారు.

అద్దంకిలో అన్నదానం

అద్దంకి,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, స్వామి సత్య సైన్య సేవాసమితిల ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి కోవి శ్రీనివాసరావు, లక్ష్మీసుజాత సహకరించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్ష ప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు గురుస్వామి, ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, ఆకుల పెద్దన్న, పల్లా నాగేశ్వరరావు, మంగమూరు సురేష్, సుబ్రహ్మణ్యం, వేదాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

పాతపుస్తకాల సేకరణ



సేకరించిన పాత పుస్తకాలతో ప్రతినిధులు, విద్యార్థులు

చీరాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సృష్టిలో అన్నీ అవసరమేనని, వాటి ద్వారా ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చో గుర్తించడమే అతిపెద్ద విజయమని పలువురు వక్తలు అన్నారు. గీతా యంగ్ సైంటిస్ట్ అండ్ రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల వారి ఆధ్వర్యంలో ఆదివారం వస్తుమార్పిడి కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో కొన్ని రోజులుగా సుమారు 130 మంది విద్యార్థుల నుంచి 1800 కిలోల పాత పుస్తకాలు, దినపత్రికలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించారు. అందుకు సంబంధించి రూ.21 వేల విలువైన నూతన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వివిధ రకాల పరికరాలను విద్యార్థులకు అందజేశారు. అంతేకాకుండా 50 కిలోల బరువు గల పాత పుస్తకాలు అందించిన వారికి ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వస్తు మార్పిడి వలన అవసరమైన వస్తువులు అందుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు పాటు పడవచ్చని వివరించారు. కార్యక్రమంలో వలివేటి మురళీకృష్ణ, డా.ఐ. బాబురావు, బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, కిరణ్, పద్మ, సుధ, నవీన్, రీఫాత్, బాజీ, రాఘవరావు, కృష్ణ, కృష్ణమూర్తి, గురు ప్రసాద్, ప్రసాద్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతవరం చెరువులో పూడికతీత



పనులు ప్రారంభిస్తున్న బాలవికాస సంస్థ ప్రతినిధులు

యద్దనపూడి,(మార్టూరు)ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి):బాలవికాస సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫిలిప్‌మొర్రీస్ ఇంటర్నేషనల్ గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ఆదివారం యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో చెరువు పూడికతీత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని గ్రామ టీడీపీ నాయకులు గుదే తారకరామారావు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు, జీపీఐ మేనేజరు ఉమమహేష్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఉమమహేష్ రైతులతో మాట్లాడుతూ చెరువు పూడికతీయడం వలన చాలా లాభాలు ఉన్నాయన్నారు. చెరువులోతు పెరగడం ద్వారా, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. దానితో పాటు భూగర్భజలాలు పెరుగుతాయన్నారు.అంతేగాకుండా ఈ పూడికమట్టిని రైతులు పంటపొలాల్లో వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా పొలాల్లో తేమశాతం పెరుగుతుందన్నారు. ఒకసారి పూడిక మట్టిని పొలంలో వేసినట్లయితే దాని ప్రతిఫలం 4 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. రైతులకు బాల వికాస సంస్థ ఉచితంగా ప్రొక్లయిన్‌తో పూడిక మట్టిని తరలిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆ ర్డినేటర్ బుర్ర విక్రమ్, పి.రాజ్‌కుమార్ రైతులు, కొరటాల వంశీకృష్ణ, పోపూరి వెంకట్రావు, పోపూరి సాంబశివరావు,పెదవల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి కదళీఫలార్చన



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా ఆదివారం 10 వేల అరటిపండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం అనంతరం స్వామి వారికి అభిషేకము నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా దశసహస్ర కదళీఫల పూజ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీర్లచెరువు భూమి ఆక్రమణకు యత్నం

- ఎక్స్‌కవేటర్‌తో చెరువులో రోడ్డు నిర్మాణం
- పనులను అడ్డుకొన్న రైతులు



పనులను అడ్డుకుంటున్న స్థానికులు

బల్లికురవ. ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగునీరు అందించే వీర్లచెరువు భూమిపై కన్నేసిన అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా యంత్రాలను ఏర్పాటు చేసి గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేసేందుకు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. చెరువులో రోడ్డు వేస్తున్నారని తెలిసిన నక్కబొక్కలపాడు గ్రామ నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, రైతులతో కలిసి వెళ్లి పనులను అడ్డుకొన్నారు. అసలు రోడ్డు ఎవరు వేయమన్నారు..? అని అడిగితే ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి పనులు చేయించాలని తనకు చెప్పారని అక్కడ ఉన్న సూపెర్‌వైజర్ రైతులతో చెప్పి, పనులు నిలిపి వేసి పక్కకు వెళ్లిపోయారు. చెరువు భూమిలో పనులు ఎలా చేస్తున్నారని అక్కడ రోడ్డు పనులు చేయిస్తున్న వారిపై అగ్రహం వ్యక్తం చేసి పనులను నిలుపుదల చేయించారు. తాము ఎగువ భాగంలో గ్రానైట్ క్వారీ లీజ్ పొంది ఉన్నామని అందుకే రోడ్డు వేస్తున్నా మని చెప్పగా ప్రభుత్వ చెరువులో రోడ్డు ఏర్పాటుకు ఎవరు అనుమతులు ఇచ్చారో తగు పత్రాలు చూపాలని రైతులు కోరారు. బల్లికురవ నుంచి చెన్నుపల్లి వెళ్లే రోడ్డులో తారు రోడ్డు అనుకొని చెరువు మధ్య వరకు మట్టి రోడ్డు వేశారని ఈ రోడ్డు వేయడం వలన రానున్న కాలంలో రైతులకు తీవ్ర ఇబ్బంది ఉంటుందని వారు తెలిపారు. ఈ రోడ్డు అనుమతులు ఇచ్చిన వారిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సోమవారం తహసీల్దార్‌కు పిర్యాదు చేస్తామని రైతులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారులు వచ్చే వరకు పనులు చేపడితే పోలీసు స్టేషన్‌కు ఎక్సకవేటర్ తరలిస్తామని రైతులు హెచ్చరించారు.



రోడ్డు వేసేందుకు కట్టపోస్తున్న ఎక్స్‌కవేటర్

దివ్యశ్రీకి ఘన సత్కారం

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానంపై హర్షం



దివ్యశ్రీకి స్వీట్లు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పట్టుదలతో దృష్టిసారిస్తే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని పలువురు ఉపాధ్యాయులు, వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించారు. రాష్ట్రంలో రెండవ స్థానం నిలిచి, జిల్లాలో మొదటిస్థానం దక్కించుకున్నారు. ఈక్రమంలో ఆదివారం పాఠశాల ఉపాధ్యాయులు ఆమె ఇంటికి చేరుకొని స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అలాగే మరి కొంత మంది విద్యార్థుల నివాసాలకు వెళ్లి అభినందించి, స్వీట్లు అందజేశారు. అంతేకాకుండా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు దేవల మనుబ్రహ్మ పందిళ్లపల్లి, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట, ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహం అందజేశారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

చినగంజాం : ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోపిరాల గ్రామ పెద్దలు అభినందించారు. చిన గంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ టీఎస్‌ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో సోపిరాల గ్రామంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 520 మార్కులు పైన సాధించిన 33 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కుర్రి సుబ్బారావు, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఒక్కొక్క విద్యార్థికి రూ.1000లు, రిటైర్డ్ కెనరా బ్యాంకు మేనేజర్ తుమ్మలపెంట సుబ్బారావు రూ.500లు, రిటైర్డ్ పీ.డీ. ఏడుగుండ్ల నాగేశ్వరరావు రూ.500లు, రిటైర్డ్ ఈఈ.కుర్రి రామసుబ్బారావు, టీఎస్ఆర్.ఆంజనేయులు జనరల్ నాలెడ్జ్, డిక్షనరీ, రిఫరెన్స్ పుస్తకాలను అందజేసి, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. అనంతరం సోపిరాల గ్రామ పెద్దలు టీఎస్ఆర్.ఆంజనేయులని ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న సోపిరాల గ్రామ పెద్దలు

కంటి సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



పంగులూరులో సూచనలు చేస్తున్న కంటివైద్యులు

పంగులూరు,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి కంటి సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలని శంకర్ కంటి వైద్యశాల నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ చిన్మయి సూచించారు. పంగులూరు రోటరీక్లబ్ ప్రాంగణంలో శంకర్ నేత్రాలయ, పెదకాకాణి వారు రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారి సహకారంతో ఆదివారం ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 174 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 117 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. ఆదివారం ప్రత్యేక బస్సులో 45 మందిని శస్త్ర చికిత్స కోసం శంకర్ నేత్రాలయకు తరలించినట్లు క్లబ్ కార్యదర్శి బత్తుల వీరనారాయణ, క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య తెలిపారు. మిగిలిన 72 మందిని ఈ నెల 29న ప్రత్యేక వాహనంలో శంకర్ నేత్రాలయానికి తరలించి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్ కాలేషావలి, వైద్యశాల ప్రతినిధి గంగాధర్, రోటరీ ప్రతినిధులు వెంకట రామారావు, పోతిన ప్రసాద్, ఆర్‌వీ. సుబ్బారావు, శంకర్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత కంటి వైద్యశిబిరం

అద్దంకి : మండలంలోని మణికేశ్వరంలో ఒంగోలు యామిని కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 67 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఈసువలి, మౌలాలి, బడావలి, అశోక్, మాధ్యూస్, నాగయ్య, రవీంద్ర, రవి, రూబేను తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు ధర తీసికట్టు



చక్రాయపాలెం వద్ద సాగు చేసిన కరివేపాకు పొలం

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): కరివేపాకు ధర రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. రెండు, మూడు నెలల క్రితం కిలో రూ.20 ఉండగా, ప్రస్తుతం ఒక్కసారిగా ధరలు తగ్గాయి. ప్రస్తుతం రూ.2కు పడిపోయింది. దీంతో సాగుచేసిన రైతులకు కనీసం పెట్టు బడులు కూడా వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

అద్దంకి ప్రాంతంలో కూరగాయలు, ఆకు కూరల సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో పలువురు రైతులు కరివేపాకు సాగు కూడా చేపట్టారు. అయితే జనవరి ఫిబ్రవరి నెలలలో కిలో కరివేపాకు ధర రూ.20 ఉండగా ఒక్కసారిగా రూ.2కు పడిపోయింది. దీంతో కనీసం కోత ఖర్చులకు కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో కొంత మంది రైతులు పొలంలోనే వదిలి వేస్తున్నా రు. డబ్బులు లేకుండా కోసుకొని వెళ్ళమన్నా వ్యాపారులు ముం దుకు రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు సాగు చేసిన కరివేపాకు పొలం ను దున్ని వేస్తున్నారు. మరి కొందరు రైతులు అయితే పెంచిన మొక్కలను దున్ని వేయలేక నష్టం అయినా భరించి వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరివేపాకు సాగు చేసి కరివేపాకుగా మారామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోత ఖర్చులు కూడా రావడం లేదు

పెట్టుబడులు పెట్టిపెంచిన కరివేపాకు కోతదశకు వచ్చే సరికి ధర ఉండడం లేదు. కనీసం కోత కూలీ కూడా రావడం లేదు. ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి అయ్యింది. రెండు నెలల క్రితం వరకు కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.2లకు కూడా కొనుగోలు చేయడం లేదు. **లక్ష్మీప్రసాద్, రైతు**

శింగరకొండలో రాతి మండపం నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న అద్దంకి పట్టణ టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన కాకాని హనుమంతరావు జ్ఞాపకార్థం కుమార్తెలు మేడా రాధిక, భీమని విజయలక్ష్మిలు రూ.1,01,116 చొప్పున తమ సోదరుడు టీడీపీ అద్దంకి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్ ద్వారా అందజేశారు. పంగులూరు మండలం ముప్పవరానికి చెందిన దూళిపాళ్ల రామచంద్రప్రసాద్, నాగేశ్వరి దంపతులు రూ.1,00,116 ఈఓ తిమ్మానాయుడు కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత వడ్డవల్లి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గంగమ్మ తిరునాళ్ల

- అశేష భక్తుల నడుమ శిడిమానోత్సవం
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : అంగరంగ వైభవంగా మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో వేంచేసిన గంగమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు వృద్ధి చెందాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని పిల్లలు, పెద్దలు అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ప్రతి ఏటా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే శిడిమహోత్సం భక్తులను ఎంతగానో అలరించింది.. వేడుకలను తిలికించేందుకు గ్రామ నలుమూల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. తిరునాళ్ళ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వయువకులు, చిన్నారుల కేరింతలతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.



గాజుల అలంకరణలో గంగమ్మ, మేళతాళాలతో వస్తున్న శిడి పెండ్లికొడుకు, ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ



భారీగా తరలి వచ్చిన భక్తుల నడుమ శిడిమహోత్సవం

భారీ బందోబస్తు...

తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చీరాల డీఎస్పీ మహమ్మద్ మోయిన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు సీఐ వై.వీ. రమణయ్య నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఇంకొల్లు ఎస్సై సురేష్, చినగంజాం ఎస్సై రమేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం దాడికి నిరసనగా ర్యాలీ



వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

వేటపాలెం (చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులదాడిలో అమాయక పర్యాటకులు మృతిచెందడం అన్యాయ మని వేటపాలెం జీడిపప్పు ఉత్పత్తిదారులు, కిరాణా, ఫ్యాన్సీ, ప్రముఖ వ్యాపారులు అన్నారు. ఆదివారం వేటపాలెం ప్రధాన కూడళ్లలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని కలవకూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులను ఆపి సీఐ సుబ్బరాజు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అపరాధ రుసుము విధించటం జరుగుతుందన్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ రక్షణగా నిలిచి ప్రాణాలు కాపాడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

అక్కయ్యపాలెం(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన చీరాల వేటపాలెం మధ్య చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం చీరాల కొత్తపాలెం చెందిన రాజు కృష్ణారెడ్డి(55) శనివారం రాత్రి వేటపాలెం నుండి చీరాల వైపు మోపెడ్‌పై వస్తున్నాడు. ఆయన వాహనాన్ని ఒంగోలు వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రేపు నూతలపాడు పోలేరమ్మ తిరునాళ్ల

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శిడిమహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సివిల్ సర్వీస్ రూల్స్-1972 సవరణ చట్టాన్ని రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు రామారావు

మార్టూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ రూల్స్-1972 సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మార్టూరు యూనిట్ సభ్యులు తీర్మానించారు. ఆదివారం మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో మార్టూరు యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కె రామారావు, కార్యదర్శి చిట్టిబాబులు మాట్లాడుతూ సవరణ చట్టం వలన విశ్రాంత ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతున్నదన్నారు. సీనియర్ సిటిజన్లుకు నష్టం కలిగించే పనులు మంచి వికావని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని సభ్యులు తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా చట్టసవరణ విశ్రాంత ఉద్యోగుల పాలిట ఆశనిపాతమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా-2 అధ్యక్షులు రావుల బాపయ్య, ఎం.పిచ్చయ్యశర్మ, కే.లక్ష్మయ్య, యూనిట్ నాయకులు పీవీ.శివరామకోటేశ్వరరావు, అంకయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం

- సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు, టీడీపీ కూటమి నాయకులు

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంటేనే పేదింటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు మత్స్యకారులు, టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. శనివారం మత్స్యకారుల భృతి అందుకున్న నేపథ్యంలో ఆదివారం వాడరేవు మత్స్యకార యార్డు వద్ద సీఎం నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. 'థాంక్యూ సీఎం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, మాజీసర్పంచ్ ఎరిపిల్లి రమణ, పిక్కి కోదండం, రామకృష్ణ, విజయ్, చిన్నారావు, గురన్న, అప్పారావు, శ్రీను, ఏసోబు, మహేష్‌బాబు, బుల్లియ తదితరులు పాల్గొన్నారు.